క్లుప్తంగా

టీటీడీ పాలకమండలి సభ్యుడు పూర్ణయ్యకు సత్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సనాతన సంస్కృతిలో దేవాలయం, గ్రంథాలయం, విద్యాలయం విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను సోమవారం సందర్శించిన తిరుక్కోవల్లూరు పూర్ణయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ ధార్మిక సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలని ఆయన్ను కోరారు. అన్ని సామాజిక వర్గాలు, మతాల్ని సమదృష్టితో చూస్తూ సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి పి.లాజర్, టీటీడీ ధార్మిక ప్రచార మాజీ కార్యదర్శి సీహెచ్‌వీఎస్ఎస్ ప్రసాద్, నన్నం ప్రకాష్, కె.చిన్నపరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బొమ్మిడాల భానుమూర్తి జన్మదిన వేడుకలు



పాత గుంటూరు: బొమ్మిడాల గ్రూప్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి 92వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో భానుమూర్తి జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు, మంచి మార్కులు సాధించి ఉన్నత చదువు చదవలేని విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. స్నేహ సమాఖ్య వృద్ధాశ్రమం, షిర్డీ సాయి దీనజన సేవాసమితి, బధిరుల పాఠశాలలకు డొనేషన్లు అందజేశారు. తమ సంస్థలో ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో భానుమూర్తి తనయులు బి.వి.ఎస్.నారాయణ, బి.వి.ఎస్.కె.రత్నం, బి.వి.ఎస్.ఆర్.వి.ప్రసాద్, మనవళ్లు బి.వి.ఎస్.కె.భాను ప్రకాష్, లావణ్య, పూజ, ఆరావ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీ మోసంపై ఫిర్యాదు

నెహ్రూనగర్: మెప్మాలో రిసోర్స్ పర్సన్‌గా(ఆర్పీగా) పని చేస్తున్న డి. పద్మ తమను మోసం చేసిందంటూ సోమవారం ఐపీడీ కాలనీకి చెందిన శ్రావణి గ్రూపు సభ్యులు కలెక్టర్ స్పందనలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రూపు పేరు మీద మనిషికి రూ.లక్ష చొప్పున ఆర్పీ రూ.10లక్షల లోన్ మంజూరు చేయించిదన్నారు. రూ.30వేలు మాత్రమే తీసుకోవాలని, మిగిలిన రూ. 70వేలు తాను తీసుకుని ప్రతి నెలా బ్యాంకుకు చెల్లిస్తానని చెప్పి రూ.7లక్షలు తీసుకుందని ఆరోపించారు. ప్రతి నెలా తాము డబ్బులు చెల్లించినప్పటికీ వాటిని బ్యాంకుకు కట్టకుండా మోసం చేసిందని తెలిపారు. దీనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, మెప్మా అధికారుల్ని కలవాలని అక్కడ అధికారులు చెప్పారన్నారు. కూలీ నాలీ చేసుకుని జీవించే తమకు రూ.70వేలు తాలుకా సంబంధించి నగదు జమ చేయాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రూపు లీడర్ ఎస్‌కే అఖిల కోరారు.

పవన్.. వ్యాఖ్యలు వెనక్కి తీసుకో!

- నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన వలంటీర్లు
- దిష్టిబొమ్మ దహనం

పట్నంబజారు: వలంటీరు వ్యవస్థ ఉగ్రరూపం దాల్చింది... పిచ్చిపట్టిన వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరికలు జారీ చేసింది... నిస్వార్థంగా సేవలు చేస్తుంటే... నీచ వ్యాఖ్యలు చేయడంపై వలంటీర్లు మండి పడ్డారు. ఏలూరులో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యల్ని నిరసిస్తూ సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని వలంటీర్లు మార్కెట్ సెంటర్, హిమని కూల్ డ్రింక్ సెంటర్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి డౌన్ డౌన్.. పవన్ కల్యాణ్ అంటూ నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ కరోనా కల్లోల సమయంలో సైతం ప్రాణాలకు తెగించి సేవలందిస్తే, చిన్నచూపుతో వ్యవహరిస్తూ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తూ ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు వెళుతున్న తమపై ఇష్టానుసారంగా నోరుపారేసుకుంటే సహించబోమని తెలిపారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తుంటే ఓర్వలేని పవన్ కల్యాణ్ పిచ్చి వ్యాఖ్యలుచేస్తున్నారని మండిపడ్డారు. మహిళల అపహరణకు సంఘ విద్రోహశక్తులతో ఎక్కడ చేతులు కలిపామో నిరూపించగలరా? అని ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఇప్పుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. నిందలు వేస్తే ప్రజలు సైతం ఉపేక్షించరని, ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.



మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పవన్ కల్యాణ్‌పై పోలీసులకు ఫిర్యాదు

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై అనుచితంగా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని కోరారు. వలంటీర్ల ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎం.సుబ్బారావు తెలిపారు.

పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

నెహ్రూనగర్: ఏలూరులో ఆదివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వలంటీర్లు భగ్గుమన్నారు. హిందూ కాలేజీ సిగ్నల్ వద్ద సోమవారం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ఇళ్లలో ఏం జరుగుతుందో కనిపెట్టాలని సీఎం వై.ఎస్. జగన్ వలంటీర్లకు చెప్పారని, ఈ మేరకు తనకు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందని పవన్ కల్యాణ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఆయన ఎమ్మెల్యే , ఎంపీ కూడా కాదు..అలాంటప్పుడు కేంద్ర వర్గాల నుంచి ఏ విధంగా సమాచారం అందిందో చెప్పాలని ప్రశ్నించారు. వలంటీర్లపై నోరు పారేసుకోవడం సిగ్గుచేటని ఖండించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో ఆయనకు వలంటీర్ల సత్తా చూపిస్తామని తెలిపారు.



హిందూ కళాశాల సెంటర్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పలతో కొడుతున్న వలంటీర్లు



లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

హోంగార్డు కుటుంబానికి చెక్కు పంపిణీ



నగరంపాలెం: మహిళా హోంగార్డు డి.రమణ గత నెలలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఫ్లాగ్ ఫండ్ రూ.10 వేల చెక్కుని ఆమె కుమార్తె సీహెచ్.దుర్గకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) పాల్గొన్నారు.

గంజాయి రహిత గుంటూరు జిల్లాకు కృషి

నగరంపాలెం: గంజాయి రహిత గుంటూరు జిల్లాకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సరఫరా, విక్రయాలు చేసే వారితో పాటు సరఫరా చేసే వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల తెనాలి, నర్సీపట్నం, ఏలూరు తదితర చోట్ల పలువురిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉందని స్పష్టం చేశారు. ఒక స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ మరో ప్రాంతానికి వెళ్తే, వెంటనే అతని వివరాల్ని ఆ పోలీస్‌స్టేషన్‌కు అందిస్తున్నామని తెలిపారు. హత్య కేసులు, గంజాయి, ఇతరత్రా కేసుల్లో నేరస్తులపై ప్రత్యేక నిఘాతో పాటు కౌన్సెలింగ్ కూడా ఉంటుందని చెప్పారు. గుంటూరు కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన బంగారం చోరీ కేసులో ఆధారాలు లభ్యమైనట్లు తెలిపారు.

ప్రయాణికులకు సౌకర్యవంత ప్రయాణం లక్ష్యం

ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు

పాత గుంటూరు: ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించాలన్న లక్ష్యంతో డ్రైవర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ ట్రాఫిక్ డీఎస్పీ యం.బాల సుందరరావు సూచించారు. గుంటూరు బస్టాండ్‌లో సోమవారం హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో 11వ బ్యాచ్ శిక్షణ తరగతుల్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదరహిత డ్రైవింగ్‌కు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి యం. రవికాంత్ మాట్లాడుతూ నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయరాదని సూచించారు. వాహనానికి 50 అడుగుల దూరం పాటించాలని, దురలవాట్లకు దూరంగా ఉంటూ ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలని డ్రైవర్లకు చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ యన్.శ్రీనివాస రావు, గుంటూరు- 2 డిపో మేనేజరు షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

బీ కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయించాలి

గుంటూరు మెడికల్: ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి పీజీ సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, వైద్య విద్యార్థుల నాయకులు డాక్టర్ శిరిగిరెడ్డి సాగర్ కుల్లాయిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న వైద్య విద్యార్థులకు మేలు జరగాలని ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెడికల్ పీజీ బీ కేటగిరి సీట్ల ఫీజుల్ని గణనీయంగా తగ్గించిందన్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే ఇక్కడ తక్కువగా ఉండటం వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులు మన రాష్ట్రంలో ఉన్న కాలేజీల్లో చేరుతున్నట్లు వెల్లడించారు. తద్వారా మన విద్యార్థులకు ప్రభుత్వం ఆశించిన మేరకు లబ్ధి చేకూరడం లేదని వివరించారు. తెలంగాణ, కర్ణాటక లాంటి రాష్ట్రాలు స్థానికులకు 85 శాతం రిజర్వేషన్ చేయడం వల్ల మన రాష్ట్ర విద్యార్థులకు అక్కడ సీట్లు వచ్చే అవకాశం బాగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. మన విద్యార్థుల పరిస్థితి రెంటికి చెడిన రేవడిలా ఉందని తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని స్థానికులకే అవకాశం కల్పించాలని వారు కోరారు.



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ సాగర్ కుల్లాయిరెడ్డి

క్యాజువాల్టీలో సూపరింటెండెంట్ కార్యాలయం

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ క్యాజువాల్టీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు రెండో కార్యాలయం ఏర్పాటు చేశారు. సోమవారం కార్యాలయాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. క్యాజువాల్టీలో రోగుల సమస్యలు తెలుసుకుని, తక్షణమే వాటిని పరిష్కరించేందుకు రెండో కార్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. ఆసుపత్రి సిబ్బంది అద్భుతంగా పని చేస్తున్నారని, వారికి చేదోడువాదోడుగా ఉండేందుకు రెండు కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల సతీష్ కుమార్, డెప్యూటీ సూరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య సేవలతో ప్రధాన్ క్లినిక్ ప్రారంభం



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రధాన్ క్లినిక్స్‌ను ప్రారంభిస్తున్నామని డాక్టర్ వెంకటేష్ తెలిపారు. ప్రముఖ బిల్డర్, వెంకటేష్ కన్‌స్ట్రక్షన్ అధినేత పులివర్తి శేషగిరిరావు కుమారుడు డాక్టర్ వెంకటేష్ స్థానిక రింగ్ రోడ్డులోని విద్యానగర్ మెయిన్ రోడ్డుపై నూతనంగా నిర్మించిన క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ మెడిసిన్, ఆర్థోపెడిక్ వైద్య సేవలు తమ క్లినిక్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రోగులకు నాణ్యమైన సత్వర సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.లక్ష్మణస్వామి, డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, డాక్టర్ జి.బాబూరావు, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ ఎం.నాగేంద్రప్రసాద్, డాక్టర్ వై.వి.ఎస్.ప్రభాకర్, డాక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు, డాక్టర్ పి.మనోహర్, డాక్టర్ జనార్దనితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఐసీడీఎస్ పీడీ మనోరంజని

నెహ్రూనగర్: అంగన్‌వాడీ టీచర్లకు రాత్రి వేళల్లో మెసేజ్‌లు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఎవరినైనా లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.మనోరంజని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గుంటూరు అర్బన్ కార్యాలయంలో ఓ ఉద్యోగి అంగన్‌వాడీ టీచర్లను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని, రాత్రి వేళల్లో మెసేజ్‌లు పెడుతూ ఇబ్బంది పెడుతున్నాడని వచ్చిన ఆరోపణల్ని పీడీ దృష్టికి తీసుకెళ్లగా... కొందరు పై తరహా ఆరోపణల్ని కొందరు చేస్తున్నారంటున్నారే తప్ప రాతపూర్వకంగా తమకు ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు. ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే సదరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు. సదరు ఉద్యోగి గతంలో పనిచేసిన ప్రాంతాల్లోనూ ఇదే విధంగా వ్యవహరించడంతో అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారని గుర్తు చేయగా... ఆ విషయాన్ని కూడా తెలుసుకున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి అద్దె బిల్లు వేయాలంటే మనిషికి రూ.2 వేలు ఇస్తేనే బిల్లు ప్రాసెస్ చేస్తానని చెప్పడం... అలా ఇవ్వని వారివి పెండింగ్‌లో పెట్టడం అతని నైజమనే ఆరోపణల పైనా పరిశీలిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.మనోరంజని తెలిపారు.

కుల, మత, పార్టీలకతీతంగా నగరాభివృద్ధి: మేయర్

నెహ్రూనగర్: కుల, మత, పార్టీలకతీతంగా గుంటూరు నగరాభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 18వ డివిజన్ శ్రీనివాసరావుపేట, రామనామక్షేత్రం, అడపా బజార్లలో రూ.90 లక్షలతో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని ప్రాధాన్యతా క్రమంలో వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారన్నారు. దీంతో నగరాభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధికి పార్టీలకతీతంగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం గుంటూరు నగరంతో పాటు నగరపాలక సంస్థ విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయని పేర్కొన్నారు. రామనామ క్షేత్రం ప్రధాన రహదారి నాలుగు రోడ్లుగా విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీనివాసరావుపేట శ్మశాన వాటికను రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు కూడా టెండర్ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయాలని, అధికారులు కూడా వాటిని పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమణి, కాండ్రుకుంట గురవయ్య, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, పశ్చిమ ఎమ్మెల్యే గిరి

వంగవీటి రంగా వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

కొరిటిపాడు: దివంగత నేత వంగవీటి మోహన రంగా వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు ఆయన చేసిన సేవల్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మర్చిపోరని, ప్రజల మనసుల్లో ఆయన ఎల్లప్పుడూ జీవించే ఉన్నారని తెలిపారు. వంగవీటి రాధా, రంగా జీవితాలలో జరిగిన పలు యథార్థ సంఘటనల గురించి ఆయన అనుచరుడు తుర్లపాటి సురేష్ రాసిన వంగవీటి చైతన్యరథ సారథులు అనే పుస్తకాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, తెలగ అభ్యుదయ సంఘ సభ్యులతో కలసి వేద సీడ్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ చరిత్రలో చిరస్మరణీయుడు వంగవీటి రంగా అని, ఆయన జీవితం మొత్తం పేద ప్రజల అభ్యున్నతికే కొనసాగించి అసువులు బాశారని తెలిపారు. పుస్తకాన్ని రాసిన తుర్లపాటి సురేష్, ప్రచురించిన తన్నీరు శివశంకర్‌ను అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. విజయ్ కుమార్, శ్రీకాంత్, డేగల వెంకటేశ్వరరావు, రంగారావు, గుడి సతీషకుమార్, ఏపూరి అనిల్, తన్నీరు శ్రీనివాసరావు, రవికుమార్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తులసి ధర్మచరణ్, తుర్లపాటి సురేష్ తదితరులు

ఫిర్యాదులను విభాగాధిపతులే పరిష్కరించాలి

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ పెద్ది రోజా సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. జగనన్నకు చెబుదాంకు అందే అర్జీల పరిష్కారానికి విభాగాధిపతే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 37 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 11, ప్రజారోగ్య విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి నాలుగు, ఉపా సెల్ విభాగానికి మూడు, పరిపాలన విభాగానికి రెండు, అకౌంట్స్ విభాగానికి ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

విద్యుత్ చౌర్యంపై పలువురికి జరిమానాలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు డీ-4 సెక్షన్ పరిధిలోని ఎస్వీఎన్ కాలనీ, బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల, నవభారత్‌నగర్‌లలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డి.విజయకృష్ణ, టి.శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో 51 మంది అధికారులు, 153 మంది సిబ్బంది, 51 బృందాలుగా ఏర్పడ్డారు. 3,933 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 140 మందికి రూ. 9.12 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ఐదుగురికి రూ. 85వేల జరిమానా విధించారు. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 135 మందికి రూ. 8.27 లక్షల అపరాధ రుసుం విధించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. విద్యుత్ చౌర్యం జరుగుతుందని తెలిస్తే 9440812263, 9440812360 నంబర్లకు వాట్సాప్ ద్వారా సమాచారం అందజేయాలని ఆయన ప్రజల్ని కోరారుఉ. తనిఖీల్లో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, కె.సుబ్బరాయుడు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, కె.అక్కిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీలో నివసించే గోపి తన ఇంటి సమీపంలో ఓ బాలికతో స్నేహంగా మెలిగి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులకు జరిగిన విషయం తెలిపింది. వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో బాలిక మృతి

పాముకాటుతో బాలిక మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వేళంగిణీనగర్ 5వ లైనులో నివసించే చంద్రశేఖర్ కుమార్తె నిరీక్షణ(12) ఆదివారం రాత్రి నేలపై నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి పాము కాటు వేసింది. అయితే, నొప్పి తెలియకపోవడంతో పాముకాటుగా ఎవరూ గుర్తించలేదు. సోమవారం ఉదయం నొప్పి ఎక్కువగా ఉండటంతో చంద్రశేఖర్ కుమార్తెను జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడే చికిత్స పొందతూ నిరీక్షణ మృతి చెందింది. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పరారైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్‌లో నివసించే ఝాన్సీ సోమవారం పాఠశాల నుంచి కుమారుడితో ఇంటికి వస్తున్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతిపై కేసు

వృద్ధురాలి మృతిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన షేక్ ఖాశింబి (60) కుమార్తె షేక్ జాన్‌బి వద్ద ఉంటోంది. ఆదివారం ఖాశింబి అనారోగ్యంతో మృతి చెందింది. అత్త మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోమవారం కోడలు అమిరున్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

లక్ష్మీపురం: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిని విచారిస్తున్న సమయంలో సెల్‌ఫోన్ల చోరీ వ్యవహారం బట్టబయలైంది. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ సీఐ పవన్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం..నాదెండ్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన గుడిపూడి విల్సన్ నుంచి నెల రోజుల కిందట పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన ముకుంద స్వరూప్ (19) రూ.10వేలు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఎన్నిమార్లు ఫోన్ చేసినా అతడు సమాధానం చెప్పడం లేదు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో విల్సన్‌కు స్వరూప్ కనిపించడంతో రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి 1వ నంబర్ ప్లాట్‌ఫారం వద్దకు తీసుకు వచ్చాడు. అదే సమయంలో రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. వారిని చూసిన స్వరూప్ పారిపోతున్న సమయంలో వెంబడించి పట్టుకుని రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్వరూప్ వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ఐదు సెల్‌ఫోన్లు దొరికాయి. రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పడం, ఫేక్ గుర్తింపు కార్డు, నేమ్ ప్లేట్లను చూపించి అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేయడం వంటివి స్వరూప్ చేస్తుంటాడని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడితో రైల్వే జీఆర్పీ సిబ్బంది

కోడిపందేల స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: నగర శివారులో కోడిపందేల స్థావరంపై దాడిచేసి నిర్వాహకుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బుడంపాడు గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో దాడి చేసినట్లు చెప్పారు. ఐదుగురు వ్యక్తులు, కోడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరచనున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై దాడిచేసి జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. మల్లవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి ఐదుగురు వ్యక్తులతోపాటు, వారి నుంచి రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.